క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



నగదు అందజేస్తున్న ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ఆదోని అర్బన్: కౌతాళం మండలానికి చెందిన ఫొటోగ్రాఫర్ చంటి నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదోని ఫొటో గ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మృతుడి కుటుంబ సభ్యులకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఫొటోగ్రాఫర్ చంటికి భార్య, నలుగురు ఆడ పిల్లలు సంతానం. ఆ కుటుంబానికి పెద్దదిక్కును కోల్పోవడంతో తమ వంతుగా సహాయం చేశామని, వారికి తాము అండగా ఉంటామని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పురుషోత్తం, విజయ్, మురళి, హుసేన్, చిన్న, అశోక్, రాము, జగదీష్, శ్రీనివాసులు, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంఊట ధ్వంసం



నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆదోని రూరల్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ నవోదయం 2.0లో భాగంగా రణమండల కొండల్లో నాటుసారా స్థావరంపై దాడులు చేసి 450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ మంగళవారం తెలిపారు. ఈ దాడుల్లో 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, ఆదోని పట్టణంలోని బోయగేరికి చెందిన బోయ మునిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఆదోని ఎక్సైజ్ మరియు సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

ఆదోనివాసికి డాక్టరేట్



బెడల క్రాంతికుమార్

ఆదోని టౌన్: పట్టణంలోని ఎన్.డీ.బీ.ఎల్. కాలనీకి చెందిన బెడల క్రాంతికుమార్ డాక్టరేట్ అందుకున్నారు. కెమిస్ట్రీలో డిజైన్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఆఫ్ మెటల్ ఆక్సైడ్ అండ్ సల్ఫైడ్ అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించడంతో హైదరాబాదు ఉస్మానియా యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రకటించారు. ఈ మేరకు ఇస్రో చైర్మన్ డా.నారాయణన్ చేతులమీదుగా డాక్టరేట్‌ను అందజేశారు. ఈయన ప్రస్తుతం ఎమ్మిగనూరు గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

వాహనాల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న ఎస్ఐ మహేష్‌కుమార్

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదోని తహసీల్దార్ ఆదేశాల మేరకు మంగళవారం వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం పాట నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ 9 ద్విచక్ర వాహనాలకు, 2 త్రిచక్ర వాహనాలకు బహిరంగ వేలం వేయగా రూ.1,70,000 ఆదాయం వచ్చిందన్నారు.

రైతుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: రైతుపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు గురురాజుదేశాయ్, జిల్లా కార్యదర్శి దయసాగర్ కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న నందవరం మండలం గురుజాల గ్రామానికి చెందిన రైతు హనుమంతును బీజేపీ నాయకులు పరామర్శించారు. వారు మాట్లాడుతూ రైతు హనుమంతు తన పొలానికి ఎద్ల బండ్లు వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు చేసుకుంటే అదే గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు రోడ్డును చెరిపివేయటమే కాకుండా, అతనిపై దాడి చేశారని తెలిపారు. గురురాజుతో పాటు బీజేపీ నాయకులు బీఎల్ నారాయణ, జట్టప్ప, మాజీ సర్పంచ్ రామన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

23 నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు

ఎమ్మిగనూరుటౌన్: ఈ నెల 23వ తేదీ నుంచి 25 వరకు ఒంగోలులో జరిగే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను పార్టీ శ్రేణులు, యువత విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో ప్రభుత్వం జాప్యం చేయడం తగదన్నారు. నాయకులు విజయేంద్ర, రాజు, మునిస్వామి, విష్ణు, మహమ్మద్ హుసేన్, విజయ్ పాల్గొన్నారు.



పక్క ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు అనిల్. పెద్దకడబూరు గ్రామం. పుట్టుకతోనే మరగుజ్జు. గతంలో సదరం క్యాంపులో ఆయనకు 65శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. ఇటీవల నిర్వహించిన సదరం రీ వెరిఫికేషన్ లో 40శాతం కంటే తక్కువ సమస్య ఉన్నట్లు నిర్ధారించి పింఛన్‌కు అనర్హుడిగా నోటీసు అందజేశారు. దీంతో అతని పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ మారిన ప్రభుత్వం మాలాంటోళ్ల కడుపు కొడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.



ఈ ఫొటోలో ఉన్న మారెప్ప, నరసయ్యలు అన్నదమ్ములు. వీరిది కోసిగి మండలం చింతకుంట. నరసయ్యకు పుట్టుకతోనే కళ్లు కనిపించవు. తమ్ముడు నరసయ్యకు వయసు పెరిగే కొద్ది చూపు పోయింది. సదరం క్యాంపులో మారెప్పకు 100 శాతం, నరసయ్యకు 75శాతం వైకల్యం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్స్ జారీ చేశారు. 2004 నుంచి ఏటా నుంచి పింఛన్ పొందుతున్నారు. ప్రస్తుతం ఇద్దరికీ నోటీసులు జారీ చేయడంతో ఆందోళన చెందుతున్నారు. ఇంటి నుంచి అడుగేస్తే మరొకరు తోడు అవసరం. వారిద్దరు వాళ్ల భార్యలను తోడుగా తీసుకొని గ్రామం నుంచి ఆటోలతో వచ్చి బస్టాండ్ నుంచి కోసిగి ఎంపీడీఓ కార్యాలయం వరకు అవస్థలు పడుతూ నడుచుకుంటూ వచ్చారు. కార్యాలయం వద్ద ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది.



పక్క ఫొటోలో కనిపిస్తున్న యువతి పేరు సుమలత. తారాపురం గ్రామం, పెద్దకడబూరు మండలం. ఆమెకు గత 10సంవత్సరాలకు పైగా రెండు చెవుల్లో చీము కారి ఎంతమంది డాక్టర్లుకు చూపించినా నయం కాకపోగా పూర్తిగా చెవులు వినిపించకుండా పోయాయి. 70శాతానికి పైగా వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో ఆమెకు వికలాంగ పింఛన్ వచ్చేది. అయితే రీ వెరిఫికేషన్‌లో 40శాతం లోపే సమస్య ఉన్నట్లు ధ్రువీకరించారు. దీంతో ఆమె జీవనం ప్రశ్నార్థకంగా మారింది. ఆమెకు 25సంవత్సరాలు ఉన్నా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో తల్లిదండ్రులు పెళ్లికూడా చేయలేదు. ఇప్పుడు ఆమె పరిస్థితిపై సందిగ్ధం నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది వీరి పరిస్థితే కాదు.. ఇలాంటి బాధితులు ప్రతి గ్రామంలో ఉన్నారు.

పింఛన్.. దివ్యాంగుల్లో టెన్షన్

- వికలాంగుల పింఛన్లు తొలగించే కుట్ర
- అర్హత ఉన్నా వైకల్యం 40 శాతం కన్నా తక్కువగా ఉందని నోటీసులు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వికలాంగులు
- కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న పింఛన్‌దారులు



కోసిగి ఎంపీడీఓ ఈశ్వరయ్యకు నోటీసులు చూపిస్తున్న దివ్యాంగులు

ఆదోని టౌన్: కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులకు వచ్చే పింఛన్‌ను సదరం సర్టిఫికెట్స్‌లో పర్సంటేజ్ తక్కువ ఉందనే సాకుతో తొలగించే కుట్రకు పాల్పడుతోంది. ప్రతి నెల వచ్చే పింఛన్‌తో కాలం గడిపే దివ్యాంగులకు అర్హత ఉన్నా కూడా నోటీసులు అందజేయడంతో దివ్యాంగులు ఆందోళనకు గురవుతున్నారు. విచారణ పేరుతో తమను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

488 మందికి నోటీసులు

ఆదోని మున్సిపాలిటీలో 2,108కి పైగా వికలాంగ పింఛన్లు ఉన్నాయి. అందులో 488 మంది పింఛన్లను వివిధ కారణాల చేత నిలిపి వేసినట్లు నోటీసులు జారీ చేశారు. దీంతో పింఛన్‌దారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. తమ పింఛన్ తొలగించారంటూ తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. 40 శాతం కన్నా తక్కువగా వైకల్యం ఉందంటూ తమ పింఛన్లను తొలగించడం ఇదెక్కడి న్యాయమంటూ వికలాంగులు ప్రశ్నిస్తున్నారు. గత నెల వరకు 60, 70 శాతం వైకల్యం ఉన్న వారికి సైతం ఇచ్చి.. ఈనెలలో విచారణ చేసి 40 శాతం కన్నా తక్కువ ఉందంటూ నోటీసులు జారీ చేసి.. సదరం క్యాంపునకు హాజరై మళ్లీ వైకల్యం సర్టిఫికెట్లు పొందాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

మధ్యాహ్నం వరకు పడిగాపులు

కోసిగి: మండలంలో 1,048 మంది వివిధ రకాలు అంగ వైకల్యంతో ప్రతి నెలా పింఛన్ పొందుతున్నారు. ఇందులో మండలంలోని వివిధ గ్రామాలకు దాదాపు 139 మందికి దివ్యాంగులకు 40 శాతం కన్నా వైకల్యం తక్కువ ఉందని, మరికొందరికి తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు నోటీసులు అందజేశారు. ఇందులో మండలంలోని చింతకుంట, వందగల్లు, కందుకూరు, కోసిగి గ్రామాల నుంచి నోటీసులు తీసుకుని మంగళవారం 10గంటలకు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. గతంలో సర్టిఫికెట్స్‌లో కొందరికి 40 శాతం కన్నా ఎక్కువ వైకల్యం ఉన్నా నోటీసులు ఎందుకు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పింఛన్ తీసుకుంటున్నా, కొత్తగా నోటీసులు అందజేయడంతో దివ్యాంగులు లబోదిబోమంటున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీడీఓ ఈశ్వరయ్య వచ్చే వరకు తిండి తిప్పలు మానుకుని పడిగాపులు కాశారు. ఆయన అక్కడికి వచ్చిన దివ్యాంగులతో మాట్లాడుతూ నోటీసులు వచ్చిన వారికి మరోసారి రీవెరిఫికేషన్ చేయిస్తామన్నారు. మరో నెల రోజుల పాటు సమయంలో ఉందని మీరు ఇక్కడ వరకు రావాల్సి అవసరం లేదని, గ్రామంలో సచివాలయాలలో సంప్రదించాలని చెప్పి పంపించారు. దీంతో ఏమి చేయాలో అర్థం కాక వెనుతిరిగి వెళ్లిపోయారు.

100 మంది పింఛన్ల తొలగింపు

పెద్దకడబూరు : దివ్యాంగులకు ప్రభుత్వం అందించే పింఛన్ వారికి ఆర్థిక భద్రతను కల్పించడంలో కీలకమైంది. వారికి పింఛన్‌లు పునః పరిశీలనలో అనర్హత పేరుతో మండలంలో 100కు పైగా పింఛన్లు తొలగించబడ్డాయి. ఈ నిర్ణయంతో వారి ఆర్థిక భద్రతపై ఆందోళన నెలకొంది.

నా పరిస్థితి చూసైనా పింఛన్ ఇవ్వాలి



తన వయస్సు 70 ఏళ్లకు పైనే ఉంది. నడవడానికి కూడా చేతకాని పరిస్థితి. అయితే ప్రభుత్వం 40 శాతం తక్కువగా వైకల్యం ఉందంటూ అధికారులు నోటీసులు జారీ చేస్తూ ఈనెల పింఛన్‌ను నిలిపివేశారు. ఇంత కన్నా దారుణం ఏమైనా ఉందా?. నా పరిస్థితి చూసి అయినా ప్రభుత్వం, అధికారులు కళ్లు తెరవాలి.

– సుబ్బారావు, కార్వన్‌పేట, ఆదోని పట్టణం

ప్రభుత్వం విచారణకు గడువు ఇచ్చింది



పింఛన్లు పొందే ప్రతి ఒక్కరు తమ వైకల్యాన్ని నిరూపించుకునేందుకు ప్రభుత్వం నెలరోజులు గడువిచ్చింది. అంతలో సదరం క్యాంపునకు హాజరై పరీక్షలు చేయించుకోవాలి. సదరం సర్టిఫికెట్లు పొందాలి. అప్పుడే పింఛన్ మంజూరవుతుంది. 40 శాతం కన్నా తక్కువగా ఉన్న పింఛన్‌దారులకు పింఛన్ నిలిపివేస్తూ నోటీసులు జారీ చేశాం. విచారణలో పరీక్షలు చేయించుకోవాలి. సదరం క్యాంపు సర్టిఫికెట్‌ను పొంది పింఛన్‌ను పొందాలి.

– ఎం.కృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఆదోని

అనుమతిలేని ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఎమ్మిగనూరురూరల్: ఎరువుల దుకాణదారులు అనుమతి లేని బయో ఎరువులను విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లోని పంచముఖి ఎరువుల దుకాణంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఎరువుల షాప్‌లో రికార్డులు, గోడౌన్లో స్టాక్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు ఓ రైతు అనుమతి లేని ఎరువులు విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేయటంతో ఆయన ఆదేశాల మేరకు తనిఖీకి వచ్చినట్లు చెప్పారు. ఎరువుల దుకాణంలో అనుమతి లేని ఎరువుల అమ్మకాలను గుర్తించినట్లు తెలిపారు. రూ. 60లు విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు చెప్పారు. 6ఏ యాక్ట్ కింద దుకాణం యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కమర్షియల్ టాక్స్ అధికారి రమణారెడ్డి, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, తహసీల్దార్ శేషఫణి, ఏవో శివశంకర్, ఏఈవో నరసింహులు తదితరులు ఉన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న సీఐ వి. శ్రీనివాసులు, టౌన్ ఎస్ఐ

ఎమ్మిగనూరురూరల్: ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని టౌన్ సీఐ వి. శ్రీనివాసులు సూచించారు. మంగళవారం సాయంత్రం పట్టణంలో హెల్మెట్ వాడకంపై వాహనదారుకుల అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారుడు మద్యం సేవించి బైక్ నడపరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, బైక్‌ను నెంబర్ ప్లేట్ లేకుండా నడపరాదని చెప్పారు. మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే కేసులు నమోదు చేయటంతో పాటు జరిమానాలు విధిస్తామన్నారు టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, ట్రాఫిక్ ఏఎస్ఐ బందెనవాజ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయం



అధికారులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధికార ప్రతినిధి గడ్డం నారాయణరెడ్డి

నందవరం : కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లు తొలగించడం సబబు కాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగపు అధికార ప్రతినిధి గడ్డం నారాయణ రెడ్డి విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో దివ్యాంగులతో కలిసి తొలగించిన దివ్యాంగుల పింఛన్లపై మండల అధికారులను ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో వివిధ రకాల దివ్యాంగులు 165 మందికి నోటీసులు జారీ చేయడం మంచిది కాదన్నారు. పుట్టికతో కళ్లు లేని వారు, మాట రానివారు, వికలాంగులకు రీవెరిఫికేషన్ పేరుతో వైకల్యం 40 శాతం మాత్రమే ఉందని తొలగించడం ప్రభుత్వానికి సిగ్గుచేట్టన్నారు. పుట్టినప్పటి నుంచి వికలాంగులుగా ఉండి గతం నుంచి ప్రస్తుతం పింఛన్లు తీసుకునే వారిని తొలగించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. తహసీల్దార్, ఎంపీడీఓలు దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరారు.


ఆధార్ అప్‌డేట్ చేయించాలి

నందవరం : మండలంలోని 5 నుంచి 15 సంవత్సరాల మధ్య గల విద్యార్థులకు ఆధార్ కార్డు బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పుల్లయ్య సచివాలయ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆధార్ క్యాంపులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో 4,900 విద్యార్థులకు ఆధార్ ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆధార్ వేలి ముద్రలపై మండల విద్యాధికారి-2 రఘునాథ్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు పాఠశాలలకు వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని రైతు సంఘ జిల్లా జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, తాలూకా అధ్యక్షుడు మాలిక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ భారత దేశం వ్యవసాయరంగంపై ఆధారపడిందని, అయితే మూడో సారి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందం చేసుకోవడంతో దేశంలో వ్యవసాయ రంగం పూర్తిగా క్షీణించే దశకు చేరుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటే నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు తిమ్మగురుడు, వీరేష్, విజయేంద్ర, ఖాజ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్

గోనెగండ్ల : పది, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే కృషి చేయాలని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సలీ బాషా సూచించారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా మధ్యాహ్న భోజనం, పాఠశాల, హాస్టల్‌లో మౌలిక వసతులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన ఉండాలన్నారు. అలాగే వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి విద్యాలో మెరుగు పరిచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలోపాఠశాల ప్రిన్సిపల్ షాహీనా పర్వీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా.. తీరని వ్యథ



కౌతాళంలో ఏఓ శేషాద్రితో రైతుల వాగ్వాదం



పెద్దకడబూరు సచివాలయం ముందు ఆందోళన చేస్తున్న రైతులు

కౌతాళం: కూటమి ప్రభుత్వం రైతులకు కంటి నిండి నిద్ర లేకుండా చేస్తుంది. పంటల దిగుబడికి పంట ఎదుగుదలకు ఎంతో ఉపయోగకరమైన యూరియా కోసం రైతన్నలు తెల్లారితే పొలం పట్టాదార్ పుస్తకం పట్టుకొని మండల కేంద్రానికి వచ్చి రైతు సేవ కేంద్రం, వ్యవసాయ కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అలసిపోతున్నారు. మండల పరిధిలోని సుళేకేరి, బంటకుంట, లింగాలదిన్నె, కాత్రికి, ఇతర గ్రామాల రైతులు యూరియా కోసం మంగళవారం ఉదయం 6 గంటల నుంచే కౌతాళంలోని రైతు సేవ కేంద్రానికి చేరుకున్నారు. పొలం పట్టాపాస్ పుస్తకాలు జమ చేసి యూరియా కోసం పడి కాపులు కాస్తున్న వ్యవసాయాధికారి మాత్రం తీరికగా 11గంటలకు వచ్చి ప్రస్తుతం మండల కేంద్రమైన కౌతాళం రైతులకు మాత్రమే యూరియాను అందించడం జరుగుతుందని, ఇతర గ్రామాలకు అందించలేమని అని తేల్చి చెప్పడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారు. కొంతమ మంది నెల రోజుల నుంచి మరి కొందరు 20రోజులు నుంచి తిరుగుతున్నామని.. ఇప్పుడు లేదని చెప్తే మా పరిస్థితి ఎలా అని శేషాద్రికి నిలదీశారు. పై నుంచి యూరియా రాకపోతే నేనేమి చేయాలని అంటూ రైతులతో వాగ్వావాదానికి దిగారు. పత్రికల్లో వార్తలు రావడం వల్లే యూరియా రావడం లేదని అధికారి తెలుపడంతో రైతులు మరింత ఆగ్రహానికి గురయ్యారు. లింగాలదిన్నెకు 45రోజుల అయ్యిందని యూరియా లేకపోతే ఎలా అంటూ లింగాలదిన్నె గ్రామానికి చెందిన ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేష్, రైతులు ఏఓతో చాల సేపు వాగ్వాదం చేశారు. రేపటిలోపు లింగాలదిన్నెకు యూరియా వస్తుందని, సుళేకేరికి రెండు రోజుల్లో యూరియా వస్తుందని చేప్పి రైతులను పంపించారు.

రైతుల కష్టం..

పెద్దకడబూరు : గత 10రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసి కొంచెం తెరిపివ్వడంతో రైతులు యూరియా కోసం పరుగులు పెడుతున్నారు. మండల కేంద్రలోని సచివాలయం - 1 వద్ద ఉదయం 7గంటల నుంచే అన్నదాతలు క్యూ కట్టారు. 10.30గంటలకు సచివాలయం తెరుచుకున్నా.. ఒక్కో రైతుకు రెండు సంచులే ఇవ్వడంతో చాలా మంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది నాయకుల పేరుతో ఇతర మండల రైతులకు యూరియా అందించడంపై మండల రైతులు వ్యవసాయాధికారులను ప్రశ్నించారు. ముందుగా ఈ మండలంలో రైతులకు సరఫరా చేయాలని అనంతరం మీరు ఎవ్వరికైనా ఇచ్చుకోండని తేల్చి చెప్పారు. ఇప్పటికైనా రైతులకు అవసరమైన మేరకు యూరియా సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై వ్యవసాయాధికారిణి సుచరితను సంప్రదించగా.. ఇతర మండలాల నుంచి పెద్దకడబూరులో పొలం గుత్తకు(కౌలు రైతులకు) చేస్తున్న వారికే యూరియా పంపిణీ చేశామన్నారు. మండలంలోని రైతులకు కావాల్సిన యూరియాను అందుబాటులో ఉంచేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ఆదోని సెంట్రల్/రూరల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శులు శశిధర్, అమర్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఆదోనిలోని డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, విద్యార్థులకు అనుగుణంగా ఎస్ఎంహెచ్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యారంగ సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించక పోతే ఈ నెల 25వ తేదీన కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఉమాకాంత్, శీను, కాసిం, చరణ్, గర్జప్ప తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

ఆదోని సెంట్రల్: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి. ఉదయ్, నాయకులు నరసింహులు, వినోద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాల రహదారిలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన బకాయిలను విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీంతో విద్యార్థులు కళాశాలలో ఫీజులు చెల్లించలేక నాన అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ నాయకులు నరసింహులు, రవి కిరణ్, చిన్న రామానాయుడు, శశి, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: రాష్ట్రవ్యాప్తంగా రూ.6,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధణాపురం ఉదయ్, నరసింహులు, వినోద్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రోడ్డుపై ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ నాయకులు నరసింహులు, రవి, కిరణ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఏర్పాట్లపై సమీక్ష

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో వినాయక చవితి ఏర్పాట్లపై మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో వినాయక కేంద్ర మండలి, అధికారులతో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా వినాయక చవితి, నిమజ్జనం సందర్భంగా పోలీస్ శాఖ చేపట్టే ఏర్పాట్లను పట్టణ సీఐ శ్రీనివాసులు వివరించారు. అదే విధంగామున్సిపల్ శాఖ తీసుకునే చర్యలను కమిషనర్ గంగిరెడ్డి వివరించారు. విద్యుత్ శాఖ డీఈ నాగేంద్రప్రసాద్, అగ్నిమాపక శాఖ ఎస్ఐ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నదీతీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నాగలదిన్నె బ్రిడ్జి వద్ద వరద తీవ్రతను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నందవరం : టీబీ డ్యాం నుంచి 26 గేట్లు ఎత్తి దిగువకు దాదాపు 1,14,000 క్యూసెక్కుల నీటిని వదిలారని, నది ప్రవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని బ్రిడ్జి వద్ద తుంగభద్ర నది వరద ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వరద నీటి తాకిడి ఎక్కువగా ఉండడంతో నదిలోకి జాలర్లు, పశువుల కాపర్లు, బట్టలు ఉతకడానికి మహిళలు నది వైపు వెళ్లారాదని ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయా గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బందికి ఆదేశించారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేత జట్టుకు నగదును అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో శ్రావణమాసం ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో కందుకూరు సీనియర్ జట్టు విజేతగా గెలుపొందింది. మంగళవారం గ్రామంలో క్రికెట్ ఫైనల్ మ్యాచ్ గ్రామానికి చెందిన సీనియర్, జూనియర్ జట్ల మధ్య జరిగింది. ఇందులో విజేతగా నిలిచిన సీనియర్ జట్టుకు ప్రథమ బహుమతి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి రూ.20వేలు, జూనియర్ జట్టుకు ద్వితీయ బహుమతి వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ బెట్టన గౌడ సంయుక్తంగా రూ.10వేలు నగదును అందజేశారు. నగదును బెట్టన గౌడ చేతుల మీదు క్రీడకారులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు తాయన్న, రామన్న, ఈరయ్య గౌడ, మాజీ ఎంపీటీసీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర పరవళ్లు.. నీటమునిగిన పొలాలు



మోటారును తొలగించుకుంటున్న రైతులు



తుంగభద్ర నది వరద నీటితో నిండిపోయిన వరిమళ్లు

కౌతాళం: తుంగభద్ర డ్యాం పరివాహక ప్రాంతంలో విస్తరంగా వర్షాలు కురుస్తుండడంతో జలాశయం పూర్తిస్థాయిలో నిండిపోయింది. దీంతో అధికారులు తుంగభద్ర నదికి లక్ష 20వేల క్యూసెక్కుల నీరు వదిలారు. మండలంలో నదితీరంలో ఉన్న గ్రామాల రైతులు అప్రమత్తమై తమ వ్యవసాయ విద్యుత్ మోటార్లను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవడం కనిపించింది. మోటార్లతో పాటు పైపులు కూడా తొలగించుకుంటున్నారు. నదీ ప్రవాహం ఇంకా పెరిగే అవకాశం ఉండడంతో తీర గ్రామాల రైతులతో పాటు ప్రజలు కూడా అప్రమత్తం అవుతున్నారు. ఇప్పటికే నదితీరంలో అర కిలోమీటర్ మేర పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. వరి పైర్లు వేసి నెల రోజులు అవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ పంటలపై ఎక్కడ ఇసుక మేట వేస్తుందని భయపడుతున్నారు. ఇదిలా ఉండగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రమైన కౌతాళంలోని ఎస్సీ కాలనీలో, 8వ వార్డులో మట్టి మిద్దెలు కూలిపోయాయి.